సాక్షి
అనంతపురం
గురువారం । 23 । ఫిబ్రవరి । 2023



టన్ను చీనీ రూ.36 వేలు

అనంతపురం మార్కెట్‌యార్డులో బుధవారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.36 వేలు పలికాయి.



టమాట కిలో రూ.22

అనంతపురం శివారులోని కక్కలపల్లి మండీలో బుధవారం కిలో టమాట గరిష్టంగా రూ.22, కనిష్టం రూ.4.50, సరాసరి ధర రూ.10 పలికింది.

గరిష్టం/కనిష్టం
37.8°/14.2°

జిల్లా అంతటా బుధవారం పగలు, రాత్రి ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఈశాన్యం నుంచి ఆగ్నేయ దిశగా గాలులు గంటకు 6 నుంచి 8 కి.మీ. వేగంతో వీచాయి.

న్యూస్‌రీల్

సోలాపూర్ - తిరుపతి ఎక్స్‌ప్రెస్ రైళ్ల గడువు పొడిగింపు



గుంతకల్లు: సోలాపూర్ - తిరుపతి - సోలాపూర్ (01437/38) స్పెషల్ వీక్లీ ఎక్స్‌ప్రెస్ రైళ్ల గడువును జూన్ 30 వరకు పొడిగిస్తున్నట్లు డివిజన్ కార్యలయ వర్గాలు తెలిపాయి. వాస్తవానికి ఈ నెల 17కే ఈ రైళ్ల రాకపోకల గడువు ముగిసింది. అయితే ప్రయాణికుల రద్దీ దృష్ట్యా రైళ్ల గడవును పొడిగించినట్లు అధికారులు వివరించారు. సోలాపూర్ జంక్షన్ (01437) నుంచి గురువారం రాత్రి 9.40 గంటలకు బయల్దేరుతుంది. శుక్రవారం రాత్రి 9.10 గంటలకు తిరుపతి జంక్షన్ (01438) నుంచి బయల్దేరుతుందన్నారు. ఈ రైలు మంత్రాలయం, ఆదోని, గుంతకల్లు, గుత్తి, తాడిపత్రి, యర్రగుంట్ల, కడప, రాజంపేట, రేణిగుంట, తిరుపతి స్టేషన్ల మీదుగా రాకపోకలు సాగుగిస్తున్నట్లు వివరించారు.

రామలింగేశ్వరా.. నమోనమః



తాడిపత్రి టౌన్ : బుగ్గ రామలింగేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. పదో రోజు బుధవారం ఉదయం వసంతోత్సవం నిర్వహించారు. రాత్రి హంసవాహనంపై పార్వతీ సమేత బుగ్గరామలింగేశ్వరస్వామి పుర వీధుల్లో విహరించారు. భక్తులు స్వామివారిని దర్శించుకుని, ప్రత్యేక పూజలు చేశారు.

డ్రాపౌట్లకు ఓపెన్ ఇంటర్‌లో అడ్మిషన్లు

అనంతపురం: ఇంటర్మీడియెట్ కోర్సు చదువుతూ అర్ధంతరంగా ఆపేసిన విద్యార్థుల (డ్రాపౌట్ల)కు ఓపెన్ ఇంటర్‌లో అడ్మిషన్లకు అవకాశం కల్పిస్తున్నట్లు డీఈఓ ఎం.సాయిరాం తెలిపారు. ఈ నెల 27లోపు అడ్మిషన్ ఫీజు చెల్లించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. అన్ని జూనియర్ కళాశాలల ప్రిన్సిపాళ్లను నేరుగా సంప్రదించి అడ్మిషన్‌కు దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు.

గాడిదల పెంపకంపై నేడు అవగాహన సదస్సు

బుక్కరాయసముద్రం: గాడిదల పెంపకంపై బీకేఎస్ మండలం రెడ్డిపల్లి పశుసంవర్ధక శాఖ రీజనల్ ట్రైనింగ్ సెంటర్‌లో గురువారం అవగాహన సదస్సు నిర్వహించనున్నారు. ఈ మేరకు పశు సంవర్ధక శాఖ అధికారి డాక్టర్ రామచంద్రారెడ్డి బుధవారం ఓ ప్రకటన విడుదల చేశారు. సదస్సుకు న్యూఢిల్లీకి చెందిన బ్రూక్ ఇండియా ఆఫ్ హాస్పిటల్ నుంచి నలుగురు వైద్యులు ముఖ్య అతిథులుగా హాజరు కానున్నారు. సదస్సుకు రాష్ట్రంలోని అన్ని జిల్లాలకు చెందిన అనిమల్ వెల్ఫేర్ నోడల్ ఆఫీసర్లు, జిల్లా సొసైటీ ఫర్ ప్రివెన్షన్ ఆఫ్ క్రూయల్టీ అనిమల్ (ఎస్‌పీసీఏ) సభ్యులు, అనిమల్ వెల్ఫేర్ ఆర్గనేజేషన్ సభ్యులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొననున్నారు.

శాంతిభద్రతల పరిరక్షణే ధ్యేయం



సాయుధ దళాల నుంచి గౌరవ వందనం స్వీకరిస్తున్న డీఐజీ

అనంతపురం శ్రీకంఠంసర్కిల్: శాంతిభద్రతల పరిరక్షణే ధ్యేయంగా పనిచేయాలని డీఐజీ ఎం.రవిప్రకాష్ సూచించారు. వార్షిక తనిఖీల్లో భాగంగా బుధవారం జిల్లా సాయుధ దళాల పరేడ్‌ను ఎస్పీ ఫక్కీరప్పతో కలసి తనిఖీ చేశారు. పరేడ్‌తో పాటు పోలీసు జాగిలాల ప్రదర్శన, మాబ్ ఆపరేషన్, వీవీఐపీలకు భద్రత కల్పించడంపై నిర్వహించిన డెమోపై సమీక్షించారు. ముందుగా ఏఆర్ సాయుధ బలగాల నుంచి డీఐజీ, ఎస్పీలు గౌరవ వందనం స్వీకరించారు. పరేడ్ పరిశీలన వాహనంపై వెళ్లి క్షుణ్ణంగా పరిశీలించారు. అనంతరం పరేడ్ చేసిన సిబ్బందిని డీఐజీ అభినందించి, రివార్డు ప్రకటించారు. పోలీసులు విధుల్లో కచ్చితత్వం ఉండాలన్నారు. యూనిఫాంలో ఉన్నప్పుడు ప్రజలు మనల్ని గమనిస్తుంటారన్నారు. ఆందోళనలు, ధర్నాలు, బందోబస్తుల సందర్భంగా సమర్థవంతమైన విధులు నిర్వర్తించాలన్నారు. రాబోవు ఎన్నికల నేపథ్యంలో అందరూ సమష్టిగా పని చేయాలన్నారు. కార్యక్రమంలో పాటు అదనపు ఎస్పీలు ఇ.నాగేంద్రుడు, హనుమంతు, ఏఆర్ డీఎస్పీ శ్రీనివాసులు, ఆర్ఐ హరికృష్ణ, ఎస్ఐ నబీరసూల్, ఆర్ఎస్ఐ పాల్గొన్నారు.





ఎన్నికల రిటర్నింగ్ అధికారి కేతన్‌గార్గ్‌కు నామినేషన్ పత్రాలు సమర్పిస్తున్న వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీ అభ్యర్థులు వెన్నపూస రవీంద్రారెడ్డి (పట్టభద్రుల స్థానం), ఎంవీ రామచంద్రారెడ్డి (ఉపాధ్యాయ), సానిపల్లి మంగమ్మ (స్థానిక సంస్థలు), చిత్రంలో మంత్రులు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఉషశ్రీచరణ్, విప్ కాపు రామచంద్రారెడ్డి, ఎమ్మెల్సీ కల్పలతారెడ్డి, ఎంపీ తలారి రంగయ్య, ఎమ్మెల్యేలు అనంత వెంకటరామిరెడ్డి, తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి, శంకరనారాయణ, జొన్నలగడ్డ పద్మావతి తదితరులు

చేతల్లో సామాజిక న్యాయం

- బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీలకు జగన్ ప్రాధాన్యత
- 18 ఎమ్మెల్సీల్లో బీసీలకే 11 స్థానాల కేటాయింపు
- సామాజిక న్యాయాన్ని ప్రజలు గమనిస్తున్నారు
- వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీ అభ్యర్థులను గెలిపిస్తారు
- మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి
- అట్టహాసంగా వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీ అభ్యర్థుల నామినేషన్



వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీ అభ్యర్థులతో నామినేషన్ వేసేందుకు కలెక్టర్ కార్యాలయానికి చేరుకున్న మంత్రులు, విప్, జెడ్పీ చైర్‌పర్సన్, ఎమ్మెల్యేలు, వైఎస్సార్‌సీపీ నాయకులు

అనంతపురం అర్బన్/సప్తగిరి సర్కిల్: చట్టసభలు, రాజకీయాల్లో సామాజిక న్యాయాన్ని చేతల్లో చూపించిన ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని మంత్రి, వైఎస్సార్‌సీపీ రీజనల్ కో–ఆర్డినేటర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి కొనియాడారు. అనంతపురం స్థానిక సంస్థలు, పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానాలకు వైఎస్సార్‌సీపీ తరపున పోటీ చేస్తున్న సానిపల్లి మంగమ్మ, వెన్నపూస రవీంద్రారెడ్డి, ఎంవీ రామచంద్రారెడ్డిలకు బుధవారం ఆయన బీ ఫారం అందజేశారు. అనంతరం మంత్రులు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఉషశ్రీచరణ్, ఇతర ప్రజాప్రతినిధులు, నేతలతో కలిసి అభ్యర్థులు రిటర్నింగ్ అధికారి, ఇన్‌చార్జ్ కలెక్టర్ కేతన్‌గార్గ్ వద్ద నామినేషన్ పత్రాలను దాఖలు చేశారు. ఆ తర్వాత మీడియా పాయింట్ వద్ద మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి విలేకరులతో మాట్లాడారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీలకు ముఖ్యమంత్రి జగన్ సమ ప్రాధాన్యత ఇస్తున్నారన్నారు. టీడీపీకి బీసీలు పట్టుగొమ్మలని చెప్పే చంద్రబాబు ఏనాడూ ఆ వర్గాలకు ప్రాధాన్యత ఇవ్వలేదని ధ్వజమెత్తారు. సీఎం జగన్ బడుగులకు అధిక ప్రాధాన్యత ఇవ్వడమే కాకుండా సామాజిక న్యాయాన్ని చేతల్లో చూపిస్తున్నారని పునరుద్ఘాటించారు. ప్రస్తుతం 18 ఎమ్మెల్సీల్లో 11 స్థానాలను బీసీలకు కేటాయించారని, ఇది దేశ చరిత్రలో తొలిసారని పేర్కొన్నారు. అన్ని వర్గాలకూ సమాన అవకాశాలు కల్పిస్తున్న సీఎం జగన్‌ను ప్రజలు గమనిస్తున్నారని, ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థులను గెలిపిస్తారని ధీమా వ్యక్తం చేశారు.

వైఎస్సార్‌సీపీ అభ్యర్థుల భారీ ర్యాలీ

వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీ అభ్యర్థుల నామినేషన్ సందర్భంగా బుధవారం అనంతపురంలో భారీ ర్యాలీ నిర్వహించారు. ఉమ్మడి జిల్లా నుంచి అభిమానులు, పార్టీ శ్రేణులు, ప్రజాప్రతినిధులు తొలుత సంగమేశ్వర ఫంక్షన్ హాలుకు చేరుకున్నారు. అనంతరం అక్కడి నుంచి ర్యాలీగా కలెక్టరేట్‌కు చేరుకున్నారు. ఇన్‌చార్జ్ కలెక్టర్ కేతన్‌గార్గ్‌కు నామినేషన్ పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో మంత్రులు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఉషశ్రీచరణ్, ప్రభుత్వ విప్‌లు కాపు రామచంద్రారెడ్డి, వెన్నపూస గోపాల్‌రెడ్డి, ఎంపీలు తలారి రంగయ్య, గోరంట్ల మాధవ్, ఎమ్మెల్యేలు అనంత వెంకటరామిరెడ్డి, తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి, వై.వెంకటరామిరెడ్డి, కేతిరెడ్డి పెద్దారెడ్డి, మాలగుండ్ల శంకరనారాయణ, పీవీ సిద్ధారెడ్డి, జొన్నలగడ్డ పద్మావతి, డాక్టర్ తిప్పేస్వామి, దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి, ఎమ్మెల్సీ ఎన్నికల పరిశీలకుడు వై.శివరామిరెడ్డి, ఎమ్మెల్సీలు మొహమ్మద్ ఇక్బాల్, కల్పలతారెడ్డి, ప్రభుత్వ సలహాదారు (విద్య) ఆలూరు సాంబశివారెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య, ఏపీఐఐసీ చైర్మన్ మెట్టు గోవిందరెడ్డి, నగర మేయర్ వసీం సలీం, డిప్యూటీ మేయర్లు వాసంతి సాహిత్య, కోగటం విజయభాస్కర్‌రెడ్డి, యాదవ కార్పొరేషన్ చైర్మన్ హరీష్ కుమార్ యాదవ్, ఏపీ నాటక అకాడమీ చైర్‌పర్సన్ రాగే హరిత, రజక కార్పొరేషన్ చైర్మన్ మీసాల రంగన్న, ఆర్టీసీ జోనల్ చైర్‌పర్సన్ మంజుల, అహుడా చైర్మన్ మహాలక్ష్మి శ్రీనివాస్, జిల్లా వక్ఫ్ బోర్డు చైర్మన్ కాగజ్‌ఘర్ రిజ్వాన్, మార్కెట్‌యార్డు చైర్మన్ ఫయాజ్, వివిధ కార్పొరేషన్ల డైరెక్టర్లు శ్రీదేవి, గౌస్‌బేగ్, శ్రీనివాసులు, కేవీ రమణ, గోవిందు, శోభారాణి, వైఎస్సార్‌సీపీ నాయకులు రమేష్‌గౌడ్, జెడ్పీటీసీ, ఎంపీటీసీ సభ్యులు, కార్పొరేటర్లు, కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ, పీడీఎఫ్ అభ్యర్థుల నామినేషన్

పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానానికి టీడీపీ అభ్యర్థిగా భూమిరెడ్డి రామగోపాల్‌రెడ్డి నామినేషన్ దాఖలు చేశారు. ఆయన వెంట ఆ పార్టీ అనంతపురం, శ్రీసత్యసాయి, వైఎస్సార్ జిల్లాల అధ్యక్షులు కాలవ శ్రీనివాసులు, బీకే పార్థసారథి, శ్రీనివాసరెడ్డి, ఉరవకొండ ఎమ్మెల్యే పయ్యావుల కేశవ్ తదితరులు ఉన్నారు. పీడీఎఫ్ తరపున ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థిగా కత్తి నరసింహారెడ్డి, పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోతుల నాగరాజు నామినేషన్ దాఖలు చేశారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ ఎం.గేయానంద్ తదితరులు పాల్గొన్నారు. కాగా..ఐదో రోజు బుధవారం ఎమ్మెల్సీ స్థానాలకు 42 సెట్ల నామినేషన్లు దాఖలయ్యాయి. ఇందులో పట్టభద్రుల ఎమ్మెల్సీకి 33 సెట్లు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీకి 8 సెట్లు, స్థానిక సంస్థలకు ఒక సెట్టు దాఖలయ్యాయి. నామినేషన్ల ప్రక్రియ ప్రారంభమైన ఈ నెల 16వ తేదీ నుంచి ఇప్పటి వరకు పట్టభద్రులు, ఉపాధ్యాయ, స్థానిక సంస్థల స్థానాలకు 77 సెట్ల నామినేషన్లు దాఖలయ్యాయి. ఈ నెల 24వ తేదీన నామినేషన్ల పరిశీలన (స్క్రూటినీ) నిర్వహిస్తారు. ఈనెల 27 వరకు నామినేషన్ల ఉపసంహరణకు అవకాశం కల్పించారు.



నామినేషన్ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్సీ వై.శివరామిరెడ్డి, ఎమ్మెల్యేలు దుద్దుకుంట, వైవీఆర్



నామినేషన్ కార్యక్రమానికి ర్యాలీగా వెళ్తున్న ఎమ్మెల్యేలు అనంత, పెద్దారెడ్డి తదితరులు



టీడీపీ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిగా నామినేషన్ వేస్తున్న భూమిరెడ్డి రామగోపాల్‌రెడ్డి



పీడీఎఫ్ తరపున ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానానికి నామినేషన్ వేస్తున్న కత్తినరసింహారెడ్డి



పీడీఎఫ్ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిగా నామినేషన్ వేస్తున్న పోతుల నాగరాజు

వైఎస్సార్‌సీపీ అనుబంధ విభాగాల అధ్యక్షుల నియామకం

అనంతపురం: వైఎస్సార్‌సీపీ అనుబంధ విభాగాలకు నూతన జిల్లా అధ్యక్షులు నియమితులయ్యారు. ఈ మేరకు పార్టీ కేంద్ర కార్యాలయం బుధవారం ఒక ప్రకటన విడుదల చేసింది. జిల్లా అనుబంధ విభాగాల అధ్యక్షులు పార్టీ ప్రతిష్టతకు కృషి చేయాలని, పార్టీ ఎల్లవేళలా వారికి అండగా నిలుస్తుందని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పేర్కొన్నట్లు పార్టీ అనుబంధ విభాగాల రాష్ట్ర కోఆర్డినేటర్ చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి వెల్లడించారు. బాధ్యతలు స్వీకరించనున్న నాయకులకు ఆయన అభినందనలు తెలిపారు.

అనుబంధ విభాగం	జిల్లా అధ్యక్షుడి పేరు	నియోజకవర్గం
యువజన విభాగం	యు.మదన్‌మోహన్ రెడ్డి	అనంతపురం
మహిళా విభాగం	బిందెల శ్రీదేవి	అనంతపురం
రైతు విభాగం	ఎన్.వి.నారాయణ	శింగనమల
బీసీ సెల్	సీపీ వీరన్న	ఉరవకొండ
ఎస్టీ సెల్	సాకే రామకృష్ణ	శింగనమల
మైనార్టీ సెల్	ఎం.సైపుల్లా బేగ్	అనంతపురం
వైఎస్సార్ ట్రేడ్ యూనియన్	కొర్రపాడు హుస్సేన్ పీరా	అనంతపురం
వాణిజ్య విభాగం	జి. పాలాక్షిరెడ్డి	రాయదుర్గం
కల్చరల్ విభాగం	చిన్నంపల్లి సోమశేఖర్	కళ్యాణదుర్గం
వైఎస్సార్ సేవాదళ్	పెరుగు తిమ్మరాజు	కళ్యాణదుర్గం
పబ్లిసిటీ విభాగం	టి.ఈశ్వర్‌రెడ్డి	శింగనమల
పంచాయతీరాజ్ విభాగం	ఎం.బసవరాజు	ఉరవకొండ
గ్రీవెన్స్ సెల్	గౌని లక్ష్మీ కాంత్	రాయదుర్గం
వికలాంగుల విభాగం	ఎం.రఘునాథరెడ్డి	తాడిపత్రి
చేనేత విభాగం	చెంచుల నాగప్ప	రాయదుర్గం
ఐటీ విభాగం	సందీప్‌రెడ్డి	గుంతకల్లు
విద్యార్థి విభాగం	తిప్పలూరి సుధీర్‌రెడ్డి	రాప్తాడు
డాక్టర్స్ విభాగం	భోగే హరీష్‌కుమార్‌రెడ్డి	రాప్తాడు
క్రిస్టియన్ మైనార్టీ విభాగం	మండ్ల సుధాకర్	ఉరవకొండ

రబీ ఈ–క్రాప్ 28లోపు పూర్తవ్వాలి

- ఖరీఫ్‌కు విత్తన, ఎరువుల ప్రతిపాదనలు పంపండి
- చిరుధాన్యాల సాగుపై అవగాహన
- వీసీలో వ్యవసాయ కమిషనర్ సి.హరికిరణ్ ఆదేశం



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న డీఏఓ చంద్రానాయక్, ఏడీఏలు, ఏఓలు

అనంతపురం అగ్రికల్చర్: రబీ ఈ – క్రాప్, ఈ–కేవైసీ నమోదు ఈ నెల 28లోపు పూర్తి చేయాలని వ్యవసాయశాఖ కమిషనర్ సి.హరికిరణ్ ఆదేశించారు. బుధవారం ఆయన విజయవాడ నుంచి జిల్లా అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. సాగు చేసిన పంటలు కాకుండా వేరే పంటలను ఈ–క్రాప్‌లోకి చేరిస్తే భవిష్యత్తులో ఇబ్బందులు ఉంటాయని హెచ్చరించారు. ఇన్‌పుట్, ఇన్సూరెన్స్, ఎంఎస్‌పీ అమ్మకాలు, పంట రుణాల సున్నావడ్డీ, రైతు భరోసా లాంటి ఆర్థికంగా వెలుసుబాటు కల్పించే పథకాలకు ఈ–క్రాపే ప్రామాణికమైనందున పారదర్శకంగా జాబితా పంపాలని ఆదేశించారు. సూపర్‌చెక్ ద్వారా తుది నివేదిక 28న పంపాలన్నారు. త్వరలోనే పీఎం కిసాన్ కింద రూ.2 వేల చొప్పున జమ కానుండటంతో రైతులను అప్రమత్తం చేసి ఈ–కేవైసీ చేయించుకోవడం, అలాగే కొన్ని నెలలుగా యాక్టివ్‌గా లేని అకౌంట్లకు సంబంధించి బ్యాంకులకు వెళ్లి ఎన్‌పీసీఐ లింక్ చేయించుకోడం మంచిదన్నారు. ఆర్‌బీకేలకు అనుబంధంగా త్వరలో ఏర్పాటు చేయనున్న కమ్యూనిటీ హైరింగ్ సెంటర్ల (సీహెచ్‌సీ)కు కంపెనీలు, డీలర్ల నుంచి ధరలు ఖరారైనందున ఇక ఆలస్యం చేయకుండా మిగతా ప్రక్రియ పూర్తి చేయాలన్నారు. రానున్న 2023–24 ఖరీఫ్, రబీకి ఆర్‌బీకే వేదికగా విత్తనాలు, ఎరువుల ప్రణాళికలు, వాటి ప్రతిపాదనలు వెంటనే పంపాలన్నారు. చిరుధాన్యాల సంవత్సరం కావడంతో ఈ ఖరీఫ్‌లో పంటల సాగు, విస్తీర్ణం, వినియోగం పెంపుపై రైతులు, ప్రజల్లో పెద్ద ఎత్తున అవగాహన కల్పించి ప్రోత్సహించాలని ఆదేశించారు. వీసీలో డీఏఓ బి.చంద్రానాయక్, ఏడీఏలు వెంకటరాముడు, లక్ష్మానాయక్, యల్లప్ప, చెంగలరాయుడు, ఏఓలు వెంకటేశ్వరప్రసాద్, బాలనాయక్, రాకేష్‌నాయక్, వెంకటకుమార్ తదితరులు పాల్గొన్నారు.

25న ఉద్యోగ మేళా

అనంతపురం సప్తగిరి సర్కిల్: అనంతపురం సమీపంలోని ఏఎఫ్ ఎకాలజీ సెంటర్‌లో ఈ నెల 25న ఉదయం పది గంటలకు ఉద్యోగ మేళా నిర్వహించనున్నట్లు ఆ సెంటర్ డైరెక్టర్ వై.వి.మల్లారెడ్డి తెలిపారు. సాఫ్ట్‌వేర్, డ్రైవింగ్, బ్యాంకు ఉద్యోగాల భర్తీకి ఐసీఐసీఐ బ్యాంకు, నవగురుకుల్, లిథియం ఎలక్ట్రికల్ కార్ సంస్థలు ఇంటర్వ్యూలు నిర్వహిస్తాయని పేర్కొన్నారు. ఇందుకు సంబంధించిన వివరాలను ఆయన బుధవారం మీడియాకు ఒక ప్రకటన ద్వారా వెల్లడించారు. నవగురుకుల్ సంస్థ మహిళలకు సాఫ్ట్‌వేర్, కోడింగ్‌లో ఏడాదిపాటు బెంగళూరులో శిక్షణ ఇచ్చి ఉద్యోగ అవకాశాలు కల్పిస్తుందని తెలిపారు. అభ్యర్థులు 17 నుంచి 28 ఏళ్లలోపు వయసు కలిగి ఉండాలని సూచించారు. ఇక లిథియం ఎలక్ట్రిక్ కార్ సంస్థలో డ్రైవర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయని పేర్కొన్నారు. 20 నుంచి 50 ఏళ్లలోపు వయసు కలిగిన డ్రైవర్లు జాబ్‌మేళాకు హాజరు కావొచ్చని తెలిపారు. ఏడో తరగతి విద్యార్హత కలిగి ఉండి, డ్రైవింగ్ లైసెన్స్ ఉన్న అభ్యర్థులు అర్హులని ప్రకటించారు. ఐసీసీఐ బ్యాంకులో రిలేషన్‌షిప్ మేనేజర్ పోస్టులకు డిగ్రీ, పీజీ, ఇంజినీరింగ్ పూర్తి చేసి 20 – 25 ఏళ్ల లోపు ఉన్న వారు అర్హులని తెలిపారు. వీరికి ఎన్ఐటీ ఆధ్వర్యంలో నెల రోజుల శిక్షణ ఇచ్చి.. ఏపీ, తెలంగాణల్లో బ్యాంక్ ఆన్ రోల్‌లో ఉద్యోగ అవకాశాలు కల్పిస్తారని వివరించారు. మరిన్ని వివరాలకు 90004 87423, 08068507427 నంబర్లలో సంప్రదించవచ్చని తెలిపారు.

అనుబంధంపై పర్యవేక్షణ

- 2023-24 విద్యా సంవత్సరానికి ఎస్కేయూ అనుబంధ కళాశాల గుర్తింపునకు దరఖాస్తుల ఆహ్వానం
- అకడమిక్ క్యాలెండర్ క్రమబద్ధీకరణ నేపథ్యంలో ముందస్తుగా షెడ్యూల్ ప్రకటన
- ఈ నెల 25 నుంచి ఆన్‌లైన్‌లో నిజనిర్ధారణ కమిటీల పరిశీలన
- సీడీసీ డీన్ ఆధ్వర్యంలో క్షేత్ర స్థాయి తనిఖీలకు అవకాశం



అనంతపురం: శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం పరిధిలో కళాశాలలకు 2023–24 విద్యా సంవత్సరానికి సంబంధించి అనుబంధ గుర్తింపు ఇచ్చేందుకు దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ మొదలైంది. కోవిడ్ నేపథ్యంలో గత మూడేళ్లుగా డిగ్రీ తరగతులు నిర్దేశించిన సమయానికి ప్రారంభం కాలేదు. ఈ క్రమంలో అకడమిక్ క్యాలెండర్ గాడి తప్పింది. దీంతో 2023–24 విద్యా సంవత్సరం నుంచి డిగ్రీ కోర్సులు నిర్దేశించిన సమయానికి ప్రారంభమయ్యేలా షెడ్యూల్‌ను ఉన్నత విద్యామండలి ప్రకటించింది. ఇందులో భాగంగా డిగ్రీ కళాశాలల అనుబంధ గుర్తింపు, కోర్సుల మంజూరుకు సంబంధించిన ప్రక్రియ సైతం మొదలైంది. శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం పరిధిలో మొత్తం 110 డిగ్రీ, పీజీ, ఎంబీఏ కోర్సులు నిర్వహిస్తున్న కళాశాలలు ఉండగా... ఇందులో గత మూడేళ్లలో కేవలం 30 శాతం లోపు అడ్మిషన్లు ఉన్న డిగ్రీ కళాశాలలు 20 ఉన్నాయి.

షెడ్యూల్ ఇలా...

డిగ్రీ కళాశాలలకు అనుబంధ గుర్తింపు ఇచ్చేందుకు ఈ నెల 10న నోటిఫికేషన్‌ను ఎస్కేయూ జారీ చేసింది. ఈ నెల 15 నుంచి ఆయా కళాశాలలు డేటా అప్‌లోడ్‌కు అవకాశం కల్పించింది. ఈ డేటాను 25వ తేదీ నుంచి ప్రొఫెసర్, అసోసియేట్, అసిస్టెంట్ ప్రొఫెసర్లు సభ్యులుగా ఉన్న నిజనిర్ధారణ కమిటీ ఆన్‌లైన్‌లో పరిశీలించనుంది. ఈ ప్రక్రియ మార్చి 15వ తేదీలోపు పూర్తవుతుంది. అదే నెల 16 నుంచి 20వ తేదీ లోపు తాము గుర్తించిన లోపాలను బహిర్గతం చేసి, 25వ తేదీలోపు స్టాండింగ్ కౌన్సిల్ ఆధ్వర్యంలో అనుబంధ గుర్తింపు జారీకి సిఫారసు చేస్తారు. అనంతరం మార్చి 29 నుంచి ఏప్రిల్ 13వ తేదీలోపు లోపాలు సరిచేసుకునేందుకు అవకాశం కల్పిస్తారు. మే 12వ తేదీలోపు జీరో అడ్మిషన్లు ఉన్న కళాశాలలు, అనుబంధ గుర్తింపు లేని కళాశాలలను వర్సిటీ పరిధిలో నుంచి తొలగించడానికి పాలకమండలి అనుమతి తీసుకుంటారు. జూన్ 2వ తేదీలోపు అనుబంధ ప్రక్రియ పూర్తి చేసి, జూన్ రెండో వారంలో డిగ్రీ తరగతులు ప్రారంభమయ్యేలా చర్యలు తీసుకుంటారు.

మౌలిక సదుపాయాలు తప్పనిసరి



డిగ్రీ కళాశాలల్లో మౌలిక సదుపాయాలు తప్పనిసరిగా ఉండాలి. అధ్యాపక, విద్యార్థి నిష్పత్తి నిబంధనల మేరకు ఉండాలి. తప్పిదాలను నిజనిర్ధారణ కమిటీ దాచిపెట్టి అనుబంధ గుర్తింపునకు సహకరిస్తే చర్యలు తప్పవు. మౌలిక సదుపాయాలు ఉన్న కళాశాలల్లోనే అడ్మిషన్ పొందేందుకు విద్యార్థులు సిద్ధం కావాలి.

– ఆచార్య మాచిరెడ్డి రామకృష్ణారెడ్డి, వీసీ, ఎస్కేయూ

ఫేస్ యాప్ హాజరు తప్పనిసరి

అనంతపురం సిటీ: బయోమెట్రిక్ హాజరులో భాగంగా అమలు చేస్తున్న ఫేస్ యాప్ అటెండెన్స్‌ను ప్రతి ఒక్కరూ విధిగా వేయాలని పీఆర్ ఉద్యోగులను ఆ శాఖ ఎస్‌ఇ భాగ్యరాజ్ ఆదేశించారు. జిల్లాలోని పీఆర్, అనుబంధ శాఖలు, సచివాలయ ఉద్యోగులతో బుధవారం టెలీ కాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడారు. ఇప్పటి వరకూ ఫేస్ యాప్ అటెండెన్స్‌కు సంబంధించి 95 శాతం ప్రక్రియ పూర్తయిందన్నారు. మిగిలిన ఐదు శాతం కూడా తక్షణమే పూర్తి చేయాలని ఆదేశించారు. లేకపోతే జీతాలు, ఇతర అంశాల్లో ఇబ్బందులు తలెత్తే అవకాశముందని హెచ్చరించారు.

రైతు అనుమానాస్పద మృతి

రాప్తాడు (ఆత్మకూరు): ఆత్మకూరు మండలం సనప గ్రామంలో ఓ రైతు అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు... సనప గ్రామానికి చెందిన మాధవయ్య తనకున్న 4.30 ఎకరాల భూమిలో వ్యవసాయం చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ప్రస్తుతం రబీలో వేరుశనగ పంట సాగు చేశాడు. పంటకు పందుల బెడద ఎక్కువగా ఉండడంతో రోజూ రాత్రి పూట పొలం వద్ద కాపలాకు వెళ్లేవాడు. మంగళవారం రాత్రి పొలానికి వెళ్లిన మాధవయ్య బుధవారం ఉదయం 10 గంటలైనా ఇంటికి చేరుకోలేదు. దీంతో కుటుంబసభ్యులు పొలానికి వెళ్లి పరిశీలించగా మాధవయ్య మృతి చెందిన విషయం వెలుగుచూసింది. మృతుడి శరీరంపై ఎలాంటి గాయాలు లేవు. ఘటనపై మృతుడి భార్య హేమలత అనుమానాలు వ్యక్తం చేస్తూ పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీనిపై అనుమానాస్పద మృతి కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు. కాగా, మృతుడికి ఓ కుమారుడు, కుమార్తె ఉన్నారు.

నా చావుకు వారే కారణం

- ఆత్మహత్యాయత్నం చేస్తూ సెల్ఫీ వీడియో దిగిన యువకుడు
- మంచి జీతం వచ్చే ఉద్యోగం చూపిస్తామని వంచించారంటూ ఆవేదన
- తన భర్త ఆచూకీ కనుగొని ప్రాణాలు కాపాడాలంటూ పోలీసులకు ఫిర్యాదు చేసిన భార్య



క్రిమిసంహారక మందు తాగుతున్న ఎర్రిస్వామి (సెల్ఫీ వీడియో ఆధారం)

రాయదుర్గం రూరల్: తన ఆత్మహత్యకు ఆ ఇద్దరే కారణమంటూ ఓ యువకుడు బుధవారం ఉదయం ఓ గుర్తు తెలియని లాడ్జిలో క్రిమి సంహారక మందు తాగాడు. ఈ ఘటనను సెల్ఫీ వీడియో తీసి తన భార్య, స్నేహితులకు పంపాడు. ఇది కాస్త సామాజిక మాధ్యమాల్లో వైరల్ కావడంతో రాయదుర్గం ప్రాంతం ఒక్కసారిగా ఉలిక్కిపడింది. 15 నిమిషాల నిడివిగల సెల్ఫీ వీడియోలో ఎర్రిస్వామి పేర్కొన్న అంశాలు ఇలా...

ఏం జరిగిందీ?

గుమ్మఘట్ట మండలం కలుగోడు గ్రామానికి చెందిన ఎం.ఎర్రిస్వామి, రాయదుర్గం మండలం కెంచానపల్లి నివాసి శ్రుతి దంపతులకు ఐదేళ్ల లోపు వయసున్న ఇద్దరు కుమారులున్నారు. రాయదుర్గంలోని ఓ ప్రైవేట్ పాఠశాలలోపార్ట్‌టైం ఉద్యోగం చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఈ క్రమంలో కలుగోడు పంచాయతీ జె.వెంకటాంపల్లికి చెందిన అనిల్‌కుమార్ రెడ్డి, ఆయన సోదరుడు మనోహర్‌రెడ్డి పరిచయమయ్యారు. తమకు రూ.3 లక్షలు ఇస్తే రైల్వేలో మంచి జీతం వచ్చే ఉద్యోగం ఇప్పిస్తామని పేర్కొన్నారు. దీంతో తన తల్లి, భార్య బంగారు నగలు తాకట్టు పెట్టి 2021 డిసెంబర్‌లో రూ.3 లక్షలను ఎర్రిస్వామి అందజేశాడు. నెల రోజులు గడిచిన తర్వాత మరో రూ.2 లక్షలు డిమాండ్ చేయడంతో అప్పు చేసి గత ఏడాది ఫిబ్రవరిలో అందజేశాడు.

డ్రగ్స్ అమ్మాలంటూ ఒత్తిడి

గత ఏడాది మార్చిలో ఎర్రిస్వామిని అనిల్‌కుమార్‌రెడ్డి, మనోహర్‌రెడ్డి కలిసి తమకు తెలిసిన వ్యక్తి నాబార్డులో పనిచేస్తున్నాడని, అతనితో మాట్లాడి ఉద్యోగం వచ్చేలా చేశామని నమ్మబలికారు. విధుల్లో భాగంగా కొందరితో డిపాజిట్లు చేయిస్తే రూ.50 లక్షల రుణం కూడా ఇప్పిస్తామని పేర్కొన్నారు. ఉద్యోగం వచ్చింది కాబట్టి డిన్నర్ చేసుకుందామంటూ గోవాకు పిలుచుకెళ్లారు. అక్కడ ఎర్రిస్వామికి మద్యం తాపి, డ్రగ్స్ ఇచ్చారు. అనంతరం గదిలోకి అమ్మాయిని పంపి ఫొటోలు, వీడియోలు తీశారు. ఈ ఘటన జరిగిన తర్వాత ఎర్రిస్వామిని గంజాయి, డ్రగ్స్ అమ్మి డబ్బు తీసుకురావాలంటూ ఒత్తిడి చేశారు. తాము చెప్పినట్లుగా చేయకపోతే అమ్మాయితో గడిపిన దృశ్యాలను సామాజిక మాధ్యమాల్లో అప్‌లోడ్ చేస్తామంటూ బ్లాక్‌మెయిల్‌కు దిగారు. ఈ క్రమంలో ఎన్నో మోసపూరిత పనులకు వాడుకున్నారు. వారు చెప్పిన పద్ధతిలోనే ప్రజల నుంచి రూ.22 లక్షలు వసూలు చేసిచ్చిన తర్వాత తనపై మూడు సార్లు హత్యాయత్నం చేశారు. సాధ్యం కాక పోవడంతో దోషిని చేస్తూ కర్ణాటకలోని శిరా, బెంగళూరులో కేసులు నమోదయ్యేలా చేశారు. ఇలా ఇంకొందరు యువకుల జీవితాలు సైతం నాశనం చేశారు.

నాలుగు పేజీల సూసైడ్ నోట్

తనను అనిల్‌కుమార్‌రెడ్డి, మనోహర్‌రెడ్డి వంచన చేసిన తీరును వివరిస్తూ పోలీసులకు నాలుగు పేజీల సూసైడ్ నోట్‌ను ఎర్రిస్వామి రాశాడు. తన ఆత్మహత్యకు వారిద్దరే కారణమంటూ అందులో పేర్కొన్నాడు. తన భార్యాపిల్లలను బాగా చూసుకోవాలని తల్లిదండ్రులను, మామను కోరాడు. తన భర్త పంపిన సెల్ఫీ వీడియోలు, సూసైడ్ నోట్‌ను చూడగానే శ్రుతి ఒక్కసారిగా నిశ్చేష్టురాలైంది. ఆయన ఆచూకీ కనుగొని ప్రాణాలు కాపాడాలంటూ రాయదుర్గం అర్బన్ ఎస్‌ఐ సుమన్‌కు ఫిర్యాదు చేసింది. ఘటనపై పోలీసులు వెంటనే స్పందించారు. ఎర్రిస్వామి ఆచూకీ కోసం ముమ్మర గాలింపు చేపట్టారు.

లారీల ఢీ - డ్రైవర్ మృతి



నాగరాజు మృతదేహం

గుంతకల్లు రూరల్: రెండు లారీలు పరస్పరం ఢీకొన్న ఘటనలో ఓ లారీ డ్రైవర్ మృతి చెందాడు. క్లీనర్ గాయపడ్డాడు. పోలీసులు తెలిపిన మేరకు... వైఎస్సార్ జిల్లా వేంపల్లి మండలం మోతుకూరు గ్రామానికి చెందిన హరిజన నాగరాజు (40), తొండూరు మండలం గోటూరు గ్రామానికి చెందిన రత్నరాజు బుధవారం ఉదయం గుంతకల్లు నుంచి గుత్తికి లారీ తీసుకుని బయలుదేరారు. పట్టణ శివారులోని పారిశ్రామిక వాడ వద్దకు చేరుకోగానే వేగాన్ని నియంత్రించుకోలేక ఎదురుగా వస్తున్న మరో లారీపైకి దూసుకెళ్లారు. ప్రమాదాన్ని పసిగట్టిన మరో లారీ డ్రైవర్ వెంటనే తన వాహనాన్ని పక్కకు తిప్పాడు. అదే సమయంలో నాగరాజు నడుపుతున్న లారీ ఎదురుగా ఉన్న లారీ వెనుకభాగాన్ని బలంగా ఢీకొంది. ఘటనలో డ్రైవర్ నాగరాజుతో పాటు క్లీనర్ రత్నరాజు తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులను స్థానికులు వెంటనే 108 అంబులెన్స్ ద్వారా స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అప్పటికే నాగరాజు మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. రత్నరాజుకు చికిత్స అందజేస్తున్నారు. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు గుంతకల్లు రూరల్ ఎస్‌ఐ సురేష్ తెలిపారు.

డీజిల్ సరఫరా టెండర్ల ప్రక్రియలో గందరగోళం

అనంతపురం క్రైం: జిల్లాలోని ఆర్టీసీ డిపోలకు డీజిల్ సరఫరా చేసే టెండర్ల పరిశీలన ప్రక్రియ గందరగోళంగా సాగింది. బుధవారం జిల్లా ప్రజా రవాణా శాఖ కార్యాలయంలో టెండర్ కమిటీ సభ్యులు మోహన్‌కుమార్(సీఎంఈ), రమేష్(సీఎంఈ కమర్షియల్, కడప), లక్ష్మీదేవి(ఏఓ) టెండర్ ప్రక్రియను నిర్వహించారు. 7 డిపోలకు మొత్తం 39 టెండర్లు దాఖలు కాగా, ఇందులో 17 టెండర్లలో అన్ని డిపోలకు డీజిల్ సరఫరా చేస్తామని గుత్తేదారులు పేర్కొన్నారు. ఈ లెక్కన మొత్తం 140 దరఖాస్తులు నమోదైనట్లు కార్యనిర్వాహకులు చంద్రాయుడు(పీఓ) పేర్కొన్నారు. మధ్యాహ్నం టెండర్లు తెరిచిన అధికారులు మరో మూడ్రోజుల్లో ఫైనలైజ్ చేస్తామని ప్రకటించారు. పరిశీలన అనంతరం నాలుగు టెండర్లను తిరస్కరించారు. టెండరు ఖరారు జాప్యంపై ఉరవకొండకు చెందిన డీజిల్ బంకు నిర్వాహకుడు విశ్వ అభ్యంతరం తెలియజేశారు. న్యాయబద్ధంగా టెండర్ తెరిచిన రోజే ఖరారు చేయాల్సి ఉందన్నారు. ఇందులో గోల్‌మాల్ చేసేందుకు అధికారులు ప్రయత్నిస్తున్నారని మండిపడ్డారు. మరికొందరు టెండర్లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. దీంతో అధికారులు, టెండర్దారుల మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. చివరకు త్రీటౌన్, ఆర్టీసీ విజిలెన్స్ పోలీసులు రంగ ప్రవేశం చేసి అందరినీ శాంతింపజేశారు. టెండర్ కార్యనిర్వాహకులు చంద్రాయుడు(పీఓ) మాట్లాడుతూ.. అధిక సంఖ్యలో టెండర్లు దాఖలు కావడంతో క్షుణ్ణంగా పరిశీలించాల్సి ఉందన్నారు. 38 దరఖాస్తుల్లో 17 మంది ఏడు డిపోలకు డీజిల్ సరఫరా చేస్తామని పేర్కొన్నారని, వీటిని పలుమార్లు పరిశీలించాల్సి ఉందన్నారు. విమర్శలకు తావివ్వకుండా ఈ నెల 27న టెండర్లను ఖరారు చేస్తామని పేర్కొన్నారు. కాగా, టెండర్ల పరిశీలన ప్రక్రియను జోనల్ చైర్‌పర్సన్ మంజుల పర్యవేక్షించారు.

ఐపీటీవీ సేవలు ప్రారంభం



ఐపీటీవీ సేవలను ప్రారంభిస్తున్న బీఎస్ఎన్ఎల్ జీఎం ముజీబ్ పాషా

అనంతపురం సిటీ: ఉమ్మడి జిల్లా పరిధిలోని బీఎస్ఎన్ఎల్ వినియోగదారులకు మెరుగైన సేవలందించేందుకు సంస్థ ఎప్పుడూ ముందు వరుసలో ఉంటుందని ఆ శాఖ జనరల్ మేనేజర్ ఎస్.ముజీబ్ పాషా పేర్కొన్నారు. ఉల్కా టీవీ సహకారంతో బీఎస్ఎన్ఎల్ సంస్థ అందుబాటులోకి తీసుకువచ్చిన ఐపీటీవీ (ఇంటర్నెట్ ప్రోటోకాల్ టెలివిజన్) సేవలను బుధవారం అనంతపురంలోని వేమన టెలిఫోన్ భవన్‌లో ఆయన లాంఛనంగా ప్రారంభించి, మాట్లాడారు. ఐపీటీవీ సేవలను పొందాలంటే కచ్చితంగా సెటప్ బాక్స్ కొనుగోలు చేయాలన్నారు. సెటప్ బాక్స్‌ను ఇంట్లో ఎక్కడైనా ఏర్పాటు చేసుకోవచ్చునని, దీని ద్వారా వాయిస్ కాల్స్, ఇంటర్నెట్ సౌకర్యంతో పాటు టీవీ ప్రోగ్రాంలనూ వీక్షించవచ్చునన్నారు. ఎస్‌డీ బేసిక్ ప్లాన్ ధర రూ.229 కాగా, హెచ్‌డీ ప్యాక్‌కు రూ.279 అదనపు అద్దె చెల్లించాల్సి ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఐపీటీవీ బిజినెస్ పార్ట్‌నర్ రవికిరణ్, ఏజీఎం బాలాజీ, డీఈఈ గోపాల్, ఎస్‌డీఈ వేణుగోపాల్, ఐఎఫ్ఏ లక్ష్మీనారాయణ, ఉమ్మడి జిల్లా ఉద్యోగులు పాల్గొన్నారు.

రైలు కింద పడి... ప్రాణాలతో బయటపడి!



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న రాంబాబు

గుత్తి: ఆత్మహత్య చేసుకునేందుకు రైలు కిందపడిన ఓ యువకుడు స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. పోలీసులు తెలిపిన మేరకు... కర్నూలు జిల్లా తుగ్గలి మండలం రాంపురం గ్రామానికి చెందిన రాంబాబు.. మంగళవారం అర్ధరాత్రి దాటిన తర్వాత గుత్తి జీఆర్పీ పరిధిలోని బసినేపల్లి రైల్వే గేట్ సమీపంలో రైలు కిందపడి ఆత్మహత్యకు ప్రయత్నించాడు. అయితే రెండు పట్టాల మధ్యలో పడడంతో స్వల్ప గాయాలయ్యాయి. లోకో పైలెట్ నుంచి సమాచారం అందుకున్న గుత్తి రైల్వే పోలీసు ఎస్‌ఐ నాగప్ప, సిబ్బంది అక్కడకు చేరుకుని రాంబాబును స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం వైద్యుల సూచన మేరకు అనంతపురం సర్వజనాస్పత్రికి తీసుకెళ్లారు. అయితే రాంబాబు ఆత్మహత్యాయత్నానికి కారణాలు తెలియరాలేదు.

రేషన్ బియ్యం స్వాధీనం

ఉరవకొండ: బొలెరో వాహనంలో అక్రమంగా కర్ణాటకకు తరలిస్తున్న 41 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని మండలంలోని లత్తవరం వద్ద బుధవారం స్వాధీనం చేసుకున్నట్లు విజిలెన్స్ సీఐ రామారావు తెలిపారు. బియ్యాన్ని ఉరవకొండ స్టాక్ పాయింట్‌కు తరలించి, వాహనాన్ని సీజ్ చేసి, డ్రైవర్ అక్షయ్‌ను పోలీసులకు అప్పగించినట్లు వివరించారు.

తాడిపత్రి: మండలంలోని చుక్కలూరు వద్ద బుధవారం ఉదయం అక్రమంగా తరలిస్తున్న 24 బస్తాల రేషన్ బియ్యాన్ని విజిలెన్స్ సీఐ వెంకటరమణ స్వాధీనం చేసుకుని, బొలెరో వాహనాన్ని సీజ్ చేశారు. వాహన డ్రైవర్ నాగప్రసాద్, యల్లనూరుకు చెందిన బియ్యం వ్యాపారి నాగార్జునను అదుపులోకి తీసుకుని పోలీసులకు అప్పగించారు.

పారా ఫెన్సింగ్ క్రీడాకారుల రిజిస్ట్రేషన్ ప్రక్రియ ప్రారంభం

అనంతపురం సప్తగిరి సర్కిల్: ఈ నెల 26న నంద్యాల వేదికగా సాగే పారా ఫెన్సింగ్ రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొనే క్రీడాకారుల నమోదు ప్రక్రియ ప్రారంభమైంది. ఈ మేరకు జిల్లా పారా అథ్లెటిక్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు నాగరాజు, శ్రీనివాసులు బుధవారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఆసక్తి ఉన్న క్రీడాకారులు ఈ నెల 24వ తేదీ సాయంత్రం 5 గంటల్లోపు పేర్లు నమోదు చేసుకోవాలి. పూర్తి వివరాలకు 80741 06154, 93903 88169లో సంప్రదించవచ్చు.

క్లుప్తంగా

ప్రాక్టికల్స్ దోపిడీ అరికట్టాలి

అనంతపురం: ఇంటర్ ప్రాక్టికల్స్‌లో మాస్ కాపీయింగ్ నిర్వహిస్తామని విద్యార్థుల నుంచి అదనంగా ఫీజుల రూపంలో రూ.1,500 నుంచి రూ.2,000 వసూలు చేస్తున్న కార్పొరేట్ కళాశాలపై చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సూర్యచంద్ర యాదవ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆర్ఐఓకు మంగళవారం వినతిపత్రం అందజేశారు. జిల్లావ్యాప్తంగా ఉన్న కార్పొరేట్ కళాశాలల్లో ఈ మేరకు విద్యార్థుల నుంచి అదనంగా సొమ్ము వసూలు చేస్తూ ఇబ్బందులకు గురిచేస్తున్నారని విమర్శించారు.

ఎరుకలు ఐక్యంగా పోరాడాలి

అనంతపురం టవర్‌క్లాక్: ఎరుకలు ఐక్యంగా ఉండి హక్కుల సాధనకు పోరాడాలని ఏపీ ఎరుకల సేవా సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు చెన్నకేశవులు అన్నారు. బుధవారం స్థానిక రోడ్లు భవనాల శాఖ అతిథి గృహంలో సంఘం క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా చెన్నకేశవులు మాట్లాడుతూ అన్ని రంగాల్లో ఎరుకలు వెనుకబడిపోయారన్నారు. ఎరుకుల కులస్తులు తమ పిల్లలని విద్యావంతులు చేయాలని, అప్పుడే ఆర్థికంగా, సామాజికంగా అభివృద్ధి చెందుతారన్నారు. ఎస్సీ,ఎస్టీ అట్రాసిటీ చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలని కోరారు. ఎస్టీ కార్పొరేషన్‌కు నిధులు ఇచ్చి అభివృద్ధికి దోహద పడాలన్నారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు రాజశేఖర్, గుజ్జల ప్రకాష్, హేమలత, రిటైర్డ్ ఎస్ఐ నాగన్న, శేఖర్, రామూర్తి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మంత్రి 'సీదిరి' జన్మదినం

అనంతపురం సప్తగిరి సర్కిల్: రాష్ట్ర పశు సంవర్ధక శాఖ మంత్రి సీదిరి అప్పలరాజు జన్మదిన వేడుకలను బెస్త సంక్షేమ సంఘం గౌరవ సలహాదారు బెస్త రాజేష్ ఆధ్వర్యంలో బుధవారం నగరంలో నిర్వహించారు. అభయాంజనేయ స్వామి ఆలయంలో పూజలు నిర్వహించారు. భైరవ నగర్‌లోని రాఘవేంద్ర వృద్ధాశ్రమంలో వృద్ధులు, అనాథలకు చీరలు, పండ్లు, బిస్కెట్లను అందించారు. సాయి నగర్ దీపు బ్లడ్ బ్యాంకులో రక్తదానం చేశారు. బెస్త రాజేష్ మాట్లాడుతూ మత్స్యకారుల అభ్యున్నతికి మంత్రి కృషి ఎనలేనిదన్నారు. కార్యక్రమంలో సత్యనారాయణ, చంద్రమోహన్‌రెడ్డి, సత్యసాయి, పవన్, కుళ్లాయి, రాము, రామ్మోహన్ తదితరులు పాల్గొన్నారు.

బీఎస్ఎన్ఎల్ సేవలపై నేడు అవగాహన సదస్సు

అనంతపురం సిటీ: ప్రభుత్వ రంగ సంస్థ భారత్ సంచార్ నిగమ్ లిమిటెడ్ (బీఎస్ఎన్ఎల్) సేవలపై గురువారం అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు ఆ సంస్థ ఉమ్మడి జిల్లా జనరల్ మేనేజర్ షేక్ ముజీబ్ పాషా తెలిపారు. ఈ మేరకు బుధవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. అనంతపురంలోని వేమన టెలిఫోన్ భవన్‌లో ఉదయం 11 గంటలకు తమ సంస్థ అందించే వివిధ రకాల సేవలపై ఏర్పాటు చేయనున్న అవగాహన సదసుకు ఆసక్తి గల వారందరూ రావాల్సిందిగా కోరారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

కనగానపల్లి: మండల పరిధిలోని ముక్తాపురం సమీపంలో 44వ నంబరు జాతీయ రహదారిపై మంగళవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులు గాయపడ్డారు. స్థానికుల వివరాల మేరకు.. రాప్తాడు మండలం మరూరుకు చెందిన నాగరాజు, రాజు అనే ఇద్దరు యువకులు ద్విచక్ర వాహనంలో మామిళ్లపల్లి నుంచి మరూరు గ్రామానికి వెళ్తున్నారు. అయితే ముక్తాపురం క్రాస్ వద్ద గుర్తు తెలియని వాహనం వారి ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టింది. దీంతో ఇద్దరు యువకులు గాయపడ్డారు. హైవే పెట్రోలింగ్ పోలీసులు వెంటనే అక్కడికి చేరుకొని గాయపడ్డ ఇద్దరు యువకులను అనంతపురం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

ప్రమాదవశాత్తు కిందపడి ఒకరికి గాయాలు

గార్లదిన్నె: కల్లూరులో 44వ జాతీయ రహదారిపై బుధవారం రాత్రి జరిగిన రోడ్డుప్రమాదంలో ఒకరికి గాయాలయ్యాయి. పామిడి 108 సిబ్బంది వివరాల మేరకు పెద్దవడుగూరు మండలం కొండూరుకు చెందిన సిలార్‌బాషా బైక్‌పై కల్లూరు నుంచి పామిడి వైపు బయలుదేరాడు. ప్రమాదవశాత్తు కిందపడడంతో తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు 108లో అనంతపురం ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

ఆక్రమణలు తొలగించండి

సాక్షి ఎఫెక్ట్..

అనంతపురం క్రైం: నగరంలో పుట్‌పాత్‌ల ఆక్రమణలపై కమిషనర్ కే భాగ్య లక్ష్మి సీరియస్ అయ్యారు. తక్షణం ఆక్రమణలను తొలగించాలని ఆదేశాలు జారీ చేశారు. టౌన్ ప్లానింగ్ అధికారులకు మరోసారి మెమోలు జారీ చేశారు. బుధవారం 'సాక్షి'లో 'నగరంలో పుట్‌పాత్‌ల ఆక్రమణ' శీర్షికన కథనం ప్రచురితమైంది. దీనిపై స్పందించిన కమిషనర్ ఏసీపీలు శ్రీనివాసులు రెడ్డి, సువర్ణ, ఇన్‌చార్జ్ టీపీఓ మహబూబ్‌జాన్, బిల్డింగ్ ఇన్‌స్పెక్టర్లు దుర్గాంజలి, మురళీలకు మెమోలు జారీ చేశారు. పుట్‌పాత్‌ల ఆక్రమణలపై బిల్డింగ్ ఇన్‌స్పెక్టర్లు దుర్గాంజలి, మురళీల బాధ్యతారాహిత్యాన్ని మెమోలో పేర్కొన్నారు. పుట్‌పాత్‌ల పర్యవేక్షణలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన ఏసీపీలు, టీపీఓలపై కమిషనర్ అసంతృప్తి వ్యక్తం చేశారు. తప్పిదాలు జరగకుండా చూసుకోవాలన్నారు.

దుష్ప్రచారాలను తిప్పికొట్టండి

- ప్రతి కుటుంబాన్ని ఆప్యాయంగా పలకరించండి
- కన్వీనర్లు, గృహసారథులు, వలంటీర్లతో ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి



'మా నమ్మకం నువ్వే జగన్' స్టిక్కర్లను విడుదల చేస్తున్న ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పైలా

రాప్తాడు (ఆత్మకూరు): 'వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నియమించిన సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు జగనన్న రథసారథులు.. మనమంతా జగనన్న సైనికులం' అని ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి అన్నారు. మండలంలోని సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు, వలంటీర్లతో ఆత్మకూరులోని స్థానిక రామలింగేశ్వర ఫంక్షన్ హాల్‌లో ఎంపీపీ సుబ్బర హేమలత, కురుబ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ కురబ పార్వతమ్మ అధ్యక్షతన శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ఎమ్మెల్యేతో పాటు జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామ సచివాలయ, వలంటీర్ల వ్యవస్థ ద్వారా సంక్షేమ ఫలాలను ఇంటి ముంగిటకే అందిస్తున్న ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌కే దక్కుతుందన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాల వల్లనే ప్రజల వద్దకు ధైర్యంగా వెళ్లి వారి సమస్యలను తెలుసుకుని పరిష్కరించగలుగుతున్నామన్నారు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో జన్మభూమి కమిటీల పేరుతో టీడీపీ నాయకులు దోచుకుని పంచుకున్నారని విమర్శించారు. రాష్ట్రాభివృద్ధికి అడ్డంకులు సృష్టిస్తున్నా ప్రతిపక్షాలు, ఎల్లో మీడియా కుట్రలు, టీడీపీ పాలనలోని వైఫల్యాలను వివరిస్తూనే జగనన్న పాలనలో ఆయా కుటుంబాలకు చేకూరిన లబ్ధిని సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు వివరించాలన్నారు.

వచ్చే ఎన్నికల్లో గెలుపే లక్ష్యం కావాలి

2024లో ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ గెలుపే లక్ష్యంగా పనిచేయాలని ఎమ్మెల్యే ప్రకాష్‌రెడ్డి సూచించారు. టీడీపీ హయాంలో ఒక్క పథకాన్నైనా సక్రమంగా అమలు చేయలేదని విమర్శించారు. ప్రభుత్వంపై పనిగట్టుకుని టీడీపీ నాయకులు దిగజారుడు రాజకీయాలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎల్లో మీడియాలో సీఎం, మంత్రులు, ఎమ్మెల్యేల మీద అసత్యపు ఆరోపణలు చేస్తున్నారన్నారు. పచ్చ పత్రికలతో పాటు తమ కుటుంబ సభ్యుల మీద తప్పుడు కథనాలు ప్రచురిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. జగనన్న ఇచ్చిన హామీల్లో ఇప్పటికే 98 శాతం నెరవేర్చారని వచ్చే ఎన్నికల్లో 175 స్థానాల్లో వైఎస్సార్‌సీపీ విజయం సాధించడం తథ్యమన్నారు. రాప్తాడులో అత్యధికంగా 50 వేల మెజార్టీతో విజయం సాధిస్తామని ధీమా వ్యక్తం చేశారు. మాజీ మంత్రి పరిటాల సునీత మంత్రిగా ఉన్న సమయంలో డ్వాక్రా రుణాలు మాఫీ చేసే ఆలోచన ప్రభుత్వానికి లేదని స్వయంగా అసెంబ్లీలో అన్నారని, ఇలాంటి వాళ్లు ఏ మోహం పెట్టుకుని మళ్లీ ప్రజల్లోకి వచ్చి ఓట్లు అడుగుతారని ప్రశ్నించారు. అనంతరం గృహ సారథులకు ప్రభుత్వ పథకాల ప్రచార సాధన కిట్లను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. కార్యక్రమంలో గ్రామ సచివాలయ కన్వీనర్ల మండల అధ్యక్షుడు నరసింహా రెడ్డి, వైస్ ఎంపీపీలు విజయ్ కుమార్, నిలీమా, మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ బాలపోతన్న, సర్పంచు వరలక్ష్మి, నాయకులు చంద్రశేఖర్ రెడ్డి, వెంకట్రాముడు, వాసుదేవా రెడ్డి తదితరులు హాజరయ్యారు.

నామినేషన్ కార్యక్రమానికి తరలివెళ్లిన నాయకులు

రాప్తాడు: పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీ వైఎస్సార్‌సీపీ అభ్యర్థి వెన్నపూస రవీంద్రారెడ్డి, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి రామచంద్రారెడ్డి, స్థానిక సంస్థల ఎమ్మెల్సీ అభ్యర్థి బోయ మంగమ్మ నామినేషన్ కార్యక్రమం బుధవారం అట్టహాసంగా జరిగింది. ఎంపీపీ చిట్రెడ్డి జయలక్ష్మి, జెడ్పీటీసీ సభ్యురాలు పసుపుల హేమావతి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ జూటూరు శేఖర్, యూత్ మండల కన్వీనర్ చిట్రెడ్డి సత్యనారాయణరెడ్డి, బీసీ సెల్ నాయకుడు పసుపుల ఆది, మరూరు సొసైటీ అధ్యక్షుడు మాచిరెడ్డి కొండారెడ్డి, ఎస్సీ సెల్ మండల కన్వీనర్ నారాయణస్వామి ఆధ్వర్యంలో మండలంలోని వైఎస్సార్‌సీపీ నాయకులు, ప్రజాప్రతినిధులు అనంతపురానికి తరలివెళ్లారు.

'వైఎస్సార్‌సీపీతోనే బెస్తలకు న్యాయం'

అనంతపురం టవర్‌క్లాక్: వైఎస్సార్‌సీపీతోనే బెస్తలకు న్యాయం చేకూరిందని బెస్త కార్పొరేషన్ డైరెక్టర్ కేవీ రమణ బుధవారం తెలిపారు. గంగపుత్రులకు సీఎం జగన్ పెద్దపీట వేశారన్నారు. 6 కార్పొరేషన్లు, 3 ఎమ్మెల్సీలు, ఒక ఎంపీ, ఒక మంత్రి పదవి ఇచ్చిన ఘనత ముఖ్యమంత్రికే దక్కుతుందన్నారు. దీన్ని ఓర్వలేని పచ్చ మీడియా తప్పుడు రాతలు ప్రచురిస్తోందని విమర్శించారు. టీడీపీ మద్దతుదారులు ప్రభుత్వంపై బురద జల్లడం మానుకోవాలన్నారు. పార్టీ బలోపేతానికి బెస్తలు కృషి చేస్తామని స్పష్టం చేశారు.

ఉద్యోగ సృష్టికర్తలుగా ఎదగాలి



మాట్లాడుతున్న ఎస్కేయూ వీసీ ప్రొఫెసర్ మాచిరెడ్డి రామకృష్ణా రెడ్డి

అనంతపురం: ఉద్యోగం చేయడం కంటే పది మందికి ఉపాధి కల్పించే వారిగా ఎదగాలని ఎస్కేయూ వీసీ ప్రొఫెసర్ మాచిరెడ్డి రామకృష్ణా రెడ్డి అన్నారు. ఎస్కేయూ అటల్ ఇంక్యుబేషన్, ఉన్నత విద్యామండలి సంయుక్తంగా బుధవారం నూతన ఔత్సాహిక పారిశ్రామిక విధానం అనే అంశంపై ఎస్కేయూలో సదస్సు నిర్వహించారు. కార్యక్రమానికి వీసీ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. వినూత్న ఆలోచనలతో సమాజానికి ఉపయోగపడే ఆవిష్కరణలకు శ్రీకారం చుట్టాలన్నారు. కార్యక్రమంలో అటల్ ఇంక్యుబేషన్ డైరెక్టర్ ప్రొఫెసర్ కే. నాగభూషణ రాజు పాల్గొన్నారు.

క్రాఫ్ట్ బజార్ ప్రారంభం



క్రాఫ్ట్ బజార్‌లో వస్తువులను పరిశీలిస్తున్న మాల్యవంతం మంజుల, కోగటం విజయభాస్కర్ రెడ్డి

అనంతపురం క్రైం: నగరంలోని జిల్లా ప్రజా రవాణాధికారి (ఆర్టీసీ) కార్యాలయం ఎదురుగా ఉన్న స్థలంలో ఏర్పాటు చేసిన రాయల్ క్రాఫ్ట్ బజార్‌ను బుధవారం రీజినల్ చైర్‌పర్సన్ మాల్యవంతం మంజుల, డిప్యూటీ మేయర్ కోగటం విజయభాస్కర్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చేనేత హస్తకళలను ఆదరించాలని కోరారు. సహరన్‌పూర్ ఫర్నీచర్, లేడీస్ టాప్, స్కర్ట్స్, ఒక గ్రాము బంగారు నగలు, హైదరాబాద్ పెరల్స్, బెంగాల్ శారీస్, తదితర 50 వేల రకాల చేనేత హస్తకళలను అందుబాటులో ఉంచారన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ జయలలిత, నిర్వాహకులు వెంకటేశ్వర రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కావ్యను కాపాడిన ఖాకీలు

- ఆస్తి తగాదాలతో రెండుసార్లు ఆత్మహత్యాయత్నం
- డయల్ 100 కాల్‌తో వేగంగా స్పందించిన ధర్మవరం, 'పురం' పోలీసులు
- సకాలంలో చేరుకుని మహిళను కాపాడిన వైనం



హిందూపురం: విజయలక్ష్మి, పిల్లలకు సర్దిచెబుతున్న పోలీసులు



కావ్య, ఆమె పిల్లలు

ధర్మవరం అర్బన్ / హిందూపురం: డయల్ 100... ఎన్నో ప్రాణాలను కాపాడింది. మరెందరికో సాంత్వన కలిగించింది. ఇంకెందరికో అండగా నిలిచింది. ఇందులో పోలీసుల పాత్ర ఎవరూ మరువలేనిది. ఈ క్రమంలోనే బుధవారం ధర్మవరం, హిందూపురం పోలీసులు ఓ వివాహిత ప్రాణం కాపాడారు. ఇద్దరు పిల్లలకు తల్లి దూరం కాకుండా చూశారు. భర్త వదిలేసి వెళ్లగా అప్పుల బాధ పడలేక...ఇద్దరు పిల్లలను పోషించలేక ఓ మహిళ రైలు కింద పడి ఆత్మహత్య చేసుకునేందుకు సిద్ధం కాగా, పోలీసులు ఆమెను కాపాడారు. వివరాల్లోకి వెళితే...తెలంగాణ రాష్ట్రం ఖమ్మం జిల్లా మధిర మండలానికి చెందిన కంసల కావ్య అలియాస్ విజయలక్ష్మికి తొమ్మిదేళ్ల కూతురు అప్పుతో పాటు పదకొండేళ్ల బన్ని సంతానం. ఆమె భర్త కొంతకాలం కిందట ప్రమాదంలో గాయపడి వీరిని వదిలేసి కర్ణాటక రాష్ట్రానికి వెళ్లిపోయాడు. గతంలో భర్త చేసిన అప్పులు, కుటుంబ పోషణకు కావ్య చేసిన అప్పులు రూ.లక్షలకు చేరాయి. రుణదాతలు ఒత్తిడి చేయడంతో దిక్కుతోచని కావ్య పిల్లలను తీసుకుని కర్ణాటక వెళ్లేందుకు రైలు ఎక్కింది. బుధవారం మధ్యాహ్నం ఇద్దరు పిల్లలతో కలిసి ధర్మవరం రైల్వే స్టేషన్‌కు చేరుకుంది. అనంతరం ఇద్దరు పిల్లలనూ రైల్వే ఫ్లాట్‌ఫారంపై కూర్చోబెట్టి మంచి మాటలు చెప్పింది. రైలు కింద పడి ఆత్మహత్య చేసుకునేందుకు రైలు పట్టాలపై నడుచుకుంటూ వెళ్లింది. దీంతో ఆమె కుమారుడు బన్ని తన వద్ద ఉన్న సెల్‌ఫోన్ ద్వారా డయల్ 100కు సమాచారం ఇచ్చాడు. వెంటనే స్పందించిన వన్‌టౌన్ కానిస్టేబుళ్లు రాజప్ప, ఉపేంద్ర ఆఘమేఘాల మీద రైల్వే స్టేషన్‌కు చేరుకున్నారు. రైలు పట్టాలపై ఉన్న కావ్యను గుర్తించి కాపాడారు. అనంతరం ఆమెను, పిల్లలను స్టేషన్‌కు తీసుకువెళ్లి టిఫిన్ తినిపించారు. సమస్య తెలుసుకుని కౌన్సెలింగ్ పంపారు. ఆ తర్వాత కర్ణాటక వె రైలు ఎక్కిన కావ్య హిందూపురం రైల్వే స్టేషన్ చేరుకుంది. అక్కడ ప్లాట్‌ఫాంపై పిల్లలను కూర్చోబెట్టి రైలుకింద పడేందుకు వెళ్లగా...కుమారుడు మళ్లీ డయల్ 100కు ఫోన్ చేశాడు. దీంతో హిందూపురం వన్‌టౌన్, టూటౌన్ పోలీసులు అక్కడకు చేరుకుని కావ్యను కాపాడారు. ఆమెను సర్దిచెప్పి పోలీసులు రైల్వే ఎస్ఐ బాలాజీనాయక్ అప్పగించారు. రైల్వే ఎస్ఐ ఆమె పరిస్థితి తెలుసుకుని రుణదాతలతో ఫోన్‌లో మాట్లాడారు. మరికొంత సమయం ఇవ్వాలని సర్దిచెప్పాడు. అనంతరం కావ్యకు బంధువులకు సమాచారం ఇచ్చారు.

సమాచార సేకరణలో ఎన్ఎస్ఎస్ఓ కీలకం

అనంతపురం: సమాచార సేకరణలో నేషనల్ శాంపిల్ సర్వే కార్యాలయం (ఎన్ఎస్ఎస్ఓ) ప్రధాన భూమిక పోషిస్తోందని జాతీయ గణాంక కార్యాలయం డైరెక్టర్ నాగమల్లేశ్వర రావు అన్నారు. అనంతపురం ఆర్ట్స్ కళాశాలలో బుధవారం పలు డిగ్రీ కళాశాల విద్యార్థులకు 'అధికార గణాంక వ్యవస్థ, ప్రభుత్వ, ప్రైవేట్ రంగాల్లో ఉద్యోగ–ఉపాధి అవకాశాలు' అనే అంశంపై క్విజ్ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఉమ్మడి ప్రయోజనాలకు దేశ వ్యాప్త సర్వేలు నిర్వహించి కీలక సమాచారాన్ని సేకరించడమే ఎన్ఎస్ఎస్ఓ ముఖ్య బాధ్యత అని విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సీనియర్ గణాంక అధికారి కే. హరి నాగేష్ తదితరులు పాల్గొన్నారు.

'ఉయ్యాలవాడ'కు ఘన నివాళి



ఉయ్యాలవాడ నరసింహారెడ్డి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

అనంతపురం: స్థానిక ఆంధ్రప్రదేశ్ రెడ్డి జన సంఘం కార్యాలయంలో బుధవారం ఉయ్యాలవాడ నరసింహా రెడ్డి 176వ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ఉయ్యాలవాడ నరసింహా రెడ్డి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఏపీ రెడ్డి జనసంఘం అనంతపురం జిల్లా అధ్యక్షుడు కసిరెడ్డి శ్రీనివాస రెడ్డి, ఆర్గనైజింగ్ సెక్రటరీ రొద్దం సురేష్ రెడ్డి, పగిడిరెడ్డి రామకృష్ణా రెడ్డి, అగ్రహారం నారాయణరెడ్డి, ఆర్. అమర్‌నాథ రెడ్డి, మహిళా అధ్యక్షురాలు కటకం కృష్ణవేణి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పోతలయ్య జాతర ప్రారంభం



పోతలయ్యస్వామి మూలవిరాట్

కనగానపల్లి: మండలంలోని దాదులూరులో పోతలయ్య స్వామి జాతర బుధవారం ప్రారంభమైంది. తొలిరోజు రామగిరి మండలంలోని స్వామి కాపులు యలవగంపతో ఊరేగింపుగా స్వామి ఆభరణాలు, పూలు తీసుకువచ్చి మూలవిరాట్‌ను అలంకరించి, పూజలు చేశారు. అనంతరం చెన్నకేశవస్వామి ఆలయంలో సమారాధన నిర్వహించారు. గురువారం పోతలయ్య, చెన్నకేశవస్వామికి జ్యోతులు, బోనాలు సమర్పించనున్నారు. కార్యక్రమాలు ఆలయ పాలక మండలి చైర్మన్ రామలింగారెడ్డి పర్యవేక్షించారు.

ఎంబీబీఎస్ ఫలితాల్లో 'అనంత' టాప్



అనంతపురం సప్తగిరి సర్కిల్: వైద్య విద్య (ఎంబీబీఎస్) ఫలితాల్లో అనంతపురం మెడికల్ కళాశాల విద్యార్థులు సత్తా చాటారు. ఈ మేరకు ఆ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మైరెడ్డి నీరజ బుధవారం తెలిపారు. డాక్టర్ వైఎస్సార్ హెల్త్ యూనివర్సిటీ పరిధిలో ఎంబీబీఎస్ ఫైనలియర్ పార్ట్ 2 పబ్లిక్ పరీక్షల్లో రాష్ట్రంలోనే అత్యుత్తమ ఫలితాలను అనంత విద్యార్థులు సొంతం చేసుకున్నారన్నారు. కళాశాలకు చెందిన 2018 బ్యాచ్ వైద్య విద్యార్థులకు ఈ సందర్భంగా ఆమె ప్రత్యేకంగా అభినందించారు. పరీక్షలకు హాజరైన మొత్తం 103 మందిలో 98 మంది ఉత్తీర్ణులు కాగా, ఇందులో ఇద్దరు డిస్టింక్షన్, 68 మంది ప్రథమ శ్రేణిలో, 28 మంది ద్వితీయ శ్రేణిలో ఉత్తీర్ణత సాధించడం జరిగిందన్నారు. ప్రతిభ చాటిన విద్యార్థులను ప్రభుత్వ సర్వజనాస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రఘునందన్, అసిస్టెంట్ సూపరింటెండెంట్ డాక్టర్ రామస్వామి, మెడికల్ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ శ్రీదేవి, డాక్టర్ సుబ్రహ్మణ్యం, డాక్టర్ షారోన్ సోనియా, ప్రొఫెసర్లు అభినందించారు.

బ్రహ్మోత్సవాలు విజయవంతం చేద్దాం

ఉరవకొండ: గవిమఠం చంద్రమౌళీశ్వర స్వామి బ్రహ్మోత్సవాలను విజయవంతం చేద్దామని ఆర్డీఓ రవీంద్ర ఆదేశించారు. బుధవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఈనెల 24 నుంచి మార్చి 2 వరకూ జరిగే బ్రహ్మోత్సవాల ఏర్పాట్లు, భద్రతపై గవిమఠం సహాయ కమిషనర్ చిట్టెమ్మ, అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ.. మార్చి 1వ తేదీన జరిగే బ్రహ్మరథోత్సవానికి తరలివచ్చే భక్తులకు పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలన్నారు. ముఖ్యంగా భక్తులకు తాగునీరు, విద్యుత్ సౌకర్యాలు కల్పించడమే కాకుండా ఎండ తీవ్రత దృష్ట్యా చలువ పందిళ్లు, తాత్కాలిక మరుగుదొడ్లు ఏర్పాటు చేయాలన్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు తలెత్తకుండా 150 మంది ప్రత్యేక పోలీసు బలగాలతో బందోబస్తు ఏర్పాటు చేయాలన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమలులో ఉండటం వల్ల ఎలాంటి ఫ్లెక్సీలను ఏర్పాటు చేయరాదన్నారు. సహాయ కమిషనర్ చిట్టెమ్మ మాట్లాడుతూ.. బ్రహ్మోత్సవాల్లో లంకాదహనం సందర్భంగా పరిమిత సంఖ్యలో బాణాసంచాను అనుమతించాలని కోరారు. కార్యక్రమంలో తహసీల్దార్ షాబుద్దీన్, డిప్యూటీ తహసీల్దార్ గురుమూర్తి, ఎంపీడీఓ చంద్రమౌళి, ఈఓఆర్డీ దామోదర్‌రెడ్డి, ఎన్నికల డిప్యూటీ తహసీల్దార్ ప్రతాప్‌రెడ్డి, ఎస్ఐ వెంకటస్వామి, ఆర్అండ్‌బీ జేఈ కావ్య, ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ ఫామీదా, అగ్నిమాపక శాఖ అధికారి భీమలింగ, ఉరవకొండ ప్రభుత్వ ఆసుపత్రి వైద్యాధికారి డాక్టర్ సాహితి, విద్యుత్ శాఖ ఏఈ గురుమూర్తి, ఈఓ గౌస్‌సాహెబ్ తదితరులు పాల్గొన్నారు.

రైల్వే డబ్లింగ్ పనుల పరిశీలన



పనులు పరిశీలిస్తున్న ఉన్నతాధికారులు

ధర్మవరం: గుత్తి – ధర్మవరం రైల్వే డబ్లింగ్ ప్రాజెక్టు పనులను సౌత్ సెంట్రల్ రైల్వే జోన్ కమిషనర్, రైల్వే సేఫ్టీ ఆఫీసర్ ప్రణ్‌జీవ్ సక్సేనా బుధవారం తనిఖీ చేశారు. ధర్మవరంలో జరుగుతున్న పనులను దగ్గరుండి పరిశీలించారు. ఉదయం 10 గంటలకు ధర్మవరం నుంచి చిగిచెర్ల రైల్వేస్టేషన్‌కు చేరుకున్నారు. అక్కడి నుంచి మోటార్ ట్రాలీలో ప్రయాణిస్తూ మధ్యాహ్నం 2 గంటల వరకూ ధర్మవరం వరకు జరిగిన డబ్లింగ్ పనులను పరిశీలించారు. అక్కడక్కడా చిన్నపాటి సమస్యలను గుర్తించి వెంటనే సరిచేయించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అనంతరం ధర్మవరం రైల్వేస్టేషన్‌లోని ప్లాట్‌ఫారాలు, సేఫ్టీ పనులను తనిఖీ చేశారు. కార్యక్రమంలో డివిజనల్ రైల్వే మేనేజర్ కేవీరెడ్డి, సౌత్ సెంట్రల్ రైల్వే జోన్లకు సంబంధించిన వివిధ విభాగాల అధికారులు, స్టేషన్ మేనేజర్ నరసింహ నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

తాగిన మైకంలో యువతిపై దాడి

అనంతపురం శ్రీకంఠం సర్కిల్: స్థానిక నాలుగో రోడ్డు సమీపంలోని ఆంజనేయ స్వామి దేవాలయం సమీపంలో గుర్తు తెలియన వ్యక్తులు బుధవారం రాత్రి వీరంగం చేశారు. ఓ యువతిని నడిరోడ్డుపై అటకాయించి ఆమె మొబైల్ ఫోన్ లాక్కున్నారు. అడ్డుకోబోయిన యువతి చేతిని కొరికి తప్పించుకోబోయారు. స్థానికులు స్పందించి గుర్తుతెలియని వ్యక్తులకు దేహశుద్ధి చేశారు. వారి నుంచి తప్పించుకున్న గుర్తు తెలియని వ్యక్తులు అక్కడి నుంచి ద్విచక్రవాహనంపై ఉడాయించారు. బాధితురాలు, ఆమె సోదరి ఇద్దరూ త్రీటౌన్ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దాడి చేసిన వారు బాధిత యువతికి బాగా తెలిసిన వారుగా తెలుస్తోంది. గతంలో వీరి మధ్య జరిగిన వివాదాల నేపథ్యంలో నాలుగో పట్టణ పోలీసు స్టేషన్‌లో కేసు కూడా నమోదయినట్లు బాధితురాలు పోలీసుల దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిసింది. త్రీటౌన్ సీఐ కత్తి శ్రీనివాసులు ఘటనా స్థలానికి సిబ్బందిని పంపి దాడికి దారి తీసిన కారణాలపై ఆరా తీశారు. గతంలో వీరి మధ్య ఉన్న విభేదాల నేపథ్యంలో దాడి చేసినట్లు ప్రాథమిక నిర్ధారణకు వచ్చారు. ఇదిలా ఉండగా, స్థానికులు స్పందించి మందలించడంతో దాడికి యత్నించిన వారు చికిత్స నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రిలో చేరినట్లు తెలుస్తోంది.



లాభాల ఘాటు

ప్రస్తుతం మార్కెట్‌లో మిరపకాయలు క్వింటా రూ. 35 వేల నుంచి 38 వేల వరకూ పలుకుతున్నాయి. రైతులకు లాభాలు తెచ్చిపెడుతున్నాయి. ఈ క్రమంలోనే పంట చేతికి రావడంతో రైతుల కళ్లలో ఆనందం కనిపిస్తోంది. కూడేరు మండలం ముద్దలాపురం జల్లిపల్లి పంట పొలాల్లోని వేసిన మిరప పంట విరగ్గాసింది. పంట కోతను రైతులు ప్రారంభించారు. మంచి ధర పలుకుతుండడంతో వారి ఆనందం అంతా ఇంతా కాదు.

– సాక్షి, ఫొటోగ్రాఫర్ అనంతపురం

